క్లుప్తంగా

'భట్టి'ని కలిసిన నాయకులు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ యువజన అధ్యక్షుడు గయాసుద్దీన్, నాయకులు నజ్జు, తదితరులు డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

వంతెన నిర్మాణానికి హామీ



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజిరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కూచనపల్లిలో సుదీర్ఘకాలంగా బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి గ్రామానికి చెందిన మడప రాజిరెడ్డి తీసుకెళ్లారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో వాగుపైన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు రాజిరెడ్డి తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



విద్యార్థులతో అప్పాల ప్రసాద్‌జీ

దుబ్బాక: విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కో కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ అన్నారు. గురువారం పట్టణంలో వివిధ పాఠశాలలకు చెందిన 600 మందికి పైగా విద్యార్థులకు పరీక్ష పట్ల సందేహాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీ

మద్దూరు(హుస్నాబాద్): ట్రాక్టర్ ట్యాంకుల నుంచి డీజిల్ చోరీకి గురైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పలువురు ట్రాక్టర్ యజమానులు మంగళవారం సాయంత్రం ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె చేస్తున్నట్లు ప్రచారం కావడంతో డీజిల్ ఫుల్‌ట్యాంక్ చేయించారు. మరుసటి రోజు ట్యాంకులో ఉన్న డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పలువురి బైక్‌ల నుంచి పెట్రోల్ సైతం చోరీ జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించకపోవడంతో పాటు సీసీ కెమెరాలు లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నట్లు అభిప్రాయ పడుతున్నారు.

'కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి'



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు మోనూ ప్రకారం కోడి గుడ్లు, చికెన్ కాంట్రాక్టర్ సరఫరా చేయడం లేదని, అతడిపై చర్యలు తీసుకోవాలి కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆధ్వర్యంలో గురువారం విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ.. 49 మంది విద్యార్థులకు మెనూ ప్రకారం కోడిగుడ్లు, చికెన్ పెట్టకుండా హాస్టల్‌ను ఎలా నడిపిస్తున్నారని ప్రశ్నించారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు అరవింద్, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కుతున్న అర్జీలు!

పర్మినెంట్ సర్వేయర్ లేక తప్పని ఇబ్బందులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పర్మినెంట్ భూ సర్వేయర్ లేక దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. సర్వేల కోసం దరఖాస్తు చేసినా ఎవరూ స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. పాలకులు, అధికారులకు ఫిర్యాదు చేసినా రెండేళ్లుగా సమస్యకు పరిష్కారం దొరకడం లేదని ఆరోపిస్తున్నారు. ఇన్‌చార్జి సర్వేయర్ దళారులకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడుతున్నారు. గుంట భూమి సర్వే చేయాలన్నా నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

సమస్యగా మారిన సర్వే..

అక్కన్నపేట మండల పరిధిలో 14 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రైతులు భూములు కొనాలన్నా, విక్రయించాలన్నా భూ సర్వే తప్పనిసరి. అయితే భూ సర్వే కోసం చలాన్లు కట్టి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. సుమారుగా రెండేళ్లుగా ప్రభుత్వ సర్వేయర్ జాడలేదని, గతంలో ఉన్న పర్మినెంట్ సర్వేయర్ బదిలీపై వెళ్లడంతో నాటి నుంచి ఇన్‌చార్జి సర్వేయర్‌గా హుస్నాబాద్ మండలానికి చెందిన



అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం

వ్యక్తికి బాధ్యతలు అప్పగించారు. కానీ అతడు విధులకు సక్రమంగా రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఎకరాకు రూ. 295 మీసేవలో చలాన్ కట్టి తహసీల్‌లో అర్జీ పెట్టుకున్నా.. అవి కార్యాలయానికే పరిమితం అవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్‌ను నియమించే వరకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సర్వేయర్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పర్మినెంట్ సర్వేయర్ లేక రైతులు ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమే. ఇప్పటికే సర్వే కోసం చాలా మంది రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇన్‌చార్జి సర్వేయర్ లక్ష్మీనారాయణ రోజుకు ఒకటి, రెండు తప్ప ఎక్కువ చేయడం లేదు. తప్పకుండా ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– సంజీవ్‌కుమార్, తహసీల్దార్ అక్కన్నపేట

రాములోరి అక్షింతల పంపిణీ

నంగునూరు(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/చిన్నకోదూరు/బెజ్జంకి: అయోధ్య శ్రీరాముల వారి పూజిత అక్షింతలకు గురువారం పలు గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నంగునూరులోని వేంకటేశ్వరాలయం నుంచి తెచ్చిన అక్షింతలను ఆయా గ్రామాల్లోని హన్మాన్ దేవాలయంలో ఉంచారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మిరుదొడ్డిలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. చిన్నకోదూరు మండల పరిధిలోని మాచాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. అలాగే బెజ్జంకిలో గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, ఆలయ చైర్మన్ రాములు, తదితరులు పాల్గొన్నారు.



నంగునూరు: అక్షింతలు తీసుకెళ్తున్న భక్తులు

కొమ్మూరికి మంత్రి పదవి ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ప్రాంత అభివృద్ధి జరగాలంటే మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలోకి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణ కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంతం అసెంబ్లీ జనగామ, రెవెన్యూ డివిజన్ సిద్దిపేట, హుస్నాబాద్, ఎంపీ భువనగిరి ఇలా మూడుముక్కలుగా చేయబడిందన్నారు. నేడు జనగామలో ఎమ్మెల్యేగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి డబ్బులతో గెలిచాడే తప్ప ఆయనకు ఈ ప్రాంతంపై ఏమాత్రం ప్రేమ లేదని ఎద్దేవా చేశారు. జనగామలో నైతిక విజయం కాంగ్రెస్‌దే అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, సీపీఐ డివిజన్ నాయకులు జంగిలి యాదగిరి, నరసింహచారి, బండారి సిద్దయ్య, గూడెపు సుదర్శన్, నంగి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్

టీఏల పనితీరుపై ఆగ్రహం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులపై గడిచిన వారం, పది రోజుల పాటు గ్రామాల్లో చేపట్టిన సామాజిక తనిఖీకి సంబంధించిన ప్రజావేదికను గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ కౌసల్య మాట్లాడుతూ.. మండలంలో ఏప్రిల్ 01, 2022 నుంచి 31-03-2023 వరకు రూ. 3.15 కోట్ల విలువ గల పనులు చేపట్టారన్నారు. వీటిపై మండలంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో విచారణ చేపట్టారని తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా పలువురు కార్యదర్శులతో పాటు టీఏ, ఎఫ్ఏలకు రికవరీకి ఆదేశించామన్నారు. కాగా ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏల) పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించే టీఏలను 100 కిలోమీటర్ల దూరంలో బదిలీ చేస్తామని హెచ్చరించారు. అలాగే ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపట్టారు. హరితహారంలో నాటిన మొక్కలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఓబులేష్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఏపీఓ సత్యనారాయణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఏపీడీ కౌసల్య తదితరులు

హామీలు అమలు చేసి తీరుతాం



బెజ్జంకి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ



చిన్నకోదూరు: దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీ సీఈఓ రమేష్

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని గుండారంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విపక్షాలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని.. ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాం, సర్పంచ్ లావణ్య పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

ప్రజాపాలన పరిశీలన

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మైలారం, చిన్నకోదూరు, మేడిపల్లి, కస్తూరిపల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ రమేష్ బాబు, జెడ్పీ సీఈఓ రమేష్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీఓ సోమిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): ఆరు గ్యారంటీ పథకాలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గంప మహేందర్‌రావు కోరారు. గురువారం రాంపూర్, వెంకటాపూర్, ఖానాపూర్, నర్మేట గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ రాంగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్, తహసీల్దార్ అనిల్‌కుమార్, సర్పంచ్‌లు పద్మ, లక్ష్మి, అజీద్, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ నితిన్‌కుమార్, రవీందర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని తమకు ఇష్టమైన రంగాల్లో రాణించాలని సేయింట్ మేరీస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల విద్యానికేతన్‌లో గురువారం హైదరాబాద్‌కు చెందిన ప్రొటెండ్ కంపెనీ వారు వివిధ రకాల రోబోలను తయారు చేసి వాటి పనితీరు విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈసందర్భంగా ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యాంత్రిక జీవన విధానం పెరుగుతుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈసందర్భంగా ప్రొటెండ్ కంపెనీ వారు రూపొందించిన విండ్‌మిల్ రోబో, ఫ్లాగ్ హోసిటింగ్ రోబోలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాటా రాయప్ప, విజయపాల్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు రజని, యజ్ఞశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోబోల పనితీరును పరిశీలిస్తున్న విద్యార్థులు

నేత్రదానంతో మరొకరికి చూపు



అంజయ్య కళ్లను సేకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: నేత్రదానం చేయడం వల్ల మరొకరికి కంటిచూపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దిలాల్‌పూర్‌కు చెందిన పాశికంటి అంజయ్య, గజ్వేల్‌కు చెందిన చెన్న రాజయ్య గురువారం మృతి చెందగా కళ్లను దానం చేసేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు నంగునూరి సత్యనారాయణ, రమణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు సీపీఎం నాయకులకు లేదని మాజీ జెడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, దాసరి కళావతి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ప్రతాప్‌రెడ్డి నివాసంలో వారు మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కొమ్మూరిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రకటనల పేరుతో కాలయాపన చేయడం మాని ఆక్రమణకు సంబంధించిన ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేయాలని హితవుపలికారు. ప్రజా సమస్యలు గాలికి వదిలి కాంగ్రెస్ పార్టీ, నాయకులపైన అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ చెవిటి లింగం, పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు ఉడుముల భాస్కర్‌రెడ్డి, మంజ మల్లేశం, మస్త్యాల యాదగిరి, కామిడి జీవన్‌రెడ్డి, చెరుకు రమణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సనాది భాస్కర్, దాసరి శ్రీకాంత్, మ్యాక మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికుడికి ఘన స్వాగతం



అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న యువకులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని అంకిరెడ్డిపల్లిలో భారత సైన్యంలో దశాబ్ద కాలంపాటు పని చేసి ఉద్యోగ విరమణ పొంది స్వగ్రామానికి వచ్చిన కలకుంట్ల అశోక్‌గౌడ్ కుటుంబాన్ని గురువారం యువకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికి సన్మానించారు. గ్రామానికి చెందిన అశోక్‌గౌడ్ తల్లిదండ్రులు కుల వృత్తిని కొనసాగిస్తూ వ్యవసాయం చేసుకుంటూ చదివించారు. 2005లో భారత సైన్యంలో ఉద్యోగం సంపాదించాడు. సుదీర్ఘ కాలం పాటు ఉద్యోగంలో పని చేసి పలు హోదాలు పొందారు. 2023 డిసెంబరు 31న ఉద్యోగ విరమణ పొందగా సన్మానించారు. కార్యక్రమంలో యువకులు నర్సింలు, రమేశ్, బాలరాజు, నవీన్, సంతోష్, శివ, రవి, యాదగిరి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక: పట్టణంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఈనెల 6వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ గడ్డివాము దగ్ధం

తూప్రాన్: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం అయిన ఘటన మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలుకు చెందిన గడ్డివాము గురువారం దగ్ధం అయింది. సుమారు రూ.30 వేల విలువైన గడ్డి కాలి బూడిదైందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

◆ గిన్నిస్ రికార్డ్ బుక్ అందజేత

హుస్నాబాద్: పట్టణంలోని గ్రంథాలయానికి 2024 వరల్డ్ గిన్నిస్ రికార్డ్ బుక్‌ను అడిషనల్ జూనియర్ జడ్జి కృష్ణతేజ గురువారం ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఉమాపతికి అందజేశారు. ఈ బుక్‌ను సద్వినియోగం చేసుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఆఫ్ హుస్నాబాద్ డైమెండ్స్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1: 30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని ధర్మాజీపేట, బొప్పాపూర్, రఘోత్తంపల్లి, దుబ్బాక, చెల్లాపూర్, పెద్దచీకోడ్, రామక్కపేట, గంభీర్‌పూర్, పోతారం, పెద్దగుండవెల్లి, అప్పనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని.. ప్రజలు సహకరించాలని కోరారు.



భోగి మంట చుట్టూ చిన్నారులు, గంగిరెద్దుల విన్యాసాలు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి, భోగి మంటలు వెలిగించారు. అలాగే ఆ మంటల చుట్టూ కోలాటాలతో నృత్యం చేశారు. గంగిరెద్దు విన్యాసాలు అలరించాయి. విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతికి ఆవుపేడ కూడా దొరకడం లేదన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో చిన్నారుల నృత్యం